సాక్షి
పార్వతీపురం మన్యం

ఆదివారం | 26 | జనవరి | 2025



'అధికార' హుకుం..! -IIలో

డ్రోన్ల మంజూరులోనూ కూటమి నేతలు రాజకీయం చేస్తున్నారు. తమవారికే అందజేయాలని అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు.



వ్యాకులమాత పుణ్యక్షేత్రంలో ప్రార్థనలు -IIలో

కొత్తవలస వ్యాకులమాత పుణ్యక్షేత్రంలో శనివారం నవీన ప్రార్థనలు జరిపారు.

500 మందికి ప్రశంసాపత్రాలు

సీతంపేట: రిపబ్లిక్ డేను పురస్కరించుకుని సీతంపేట ఐటీడీఏ పరిధిలో 500ల మంది ఉద్యోగులకు ఆదివారం ప్రశంసా పత్రాలు అందజేయనున్నారు. సబ్ ప్లాన్ మండలాల పరిధిలో మండల పరిషత్, మండల రెవెన్యూ, ఎడ్యుకేషన్, ఐసీడీఎస్, జీసీసీ, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, వెలుగు తదితర శాఖల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది ప్రశంసా పత్రాలు అందుకోనున్నారు.

న్యూస్‌రీల్

అవార్డులు అందుకున్న అధికారులు



అవార్డు అందుకుంటున్న కలెక్టర్, ఏపీఎస్పీ 5వ బెటాలియన్ కమాండెంట్, ఎస్పీ

విజయనగరం అర్బన్: ఉత్తమ ఎన్నికల అధికారిగా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రంలో శనివారం నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.వి జయానంద్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించినందుకు ఎస్పీ వకుల్ జిందాల్, 5వ బెటాలియన్ కమాండెంట్ మలికాగార్గ్‌కు సైతం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అవార్డులను ప్రదానం చేశారు.

ఏఎఫ్‌ఓగా ఆదిత్య సింగ్

విజయనగరం ఫోర్ట్: జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయధికారి (డీసీహెచ్ఎస్) కార్యాలయం ఏఎఫ్ఓ (అసిస్టెంట్ ఫైనాన్స్ అధికారి)గా ఆదిత్య సింగ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పార్వతీపురంలో పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

ఏఐ నైపుణ్యంతో ఉద్యోగ అవకాశాలు

- తైవాన్ బిజినెస్ కౌన్సిల్ సంస్థ డైరెక్టర్ మిస్ హుయ్



తైవాన్ బిజినెస్ కౌన్సిల్ సంస్థ డైరెక్టర్లు మిస్ హుయ్, శివకుమార్‌కు మొక్కలతో స్వాగతం

విజయనగరం అర్బన్: కృత్రిమ మేధస్సు (ఏఐ)పై నైపుణ్యం ఉన్న విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు అధికమని తైవాన్‌కు చెందిన గ్లోబల్ ఎకనమిక్ ట్రేడ్ అండ్ బిజినెస్ కౌన్సిల్ సంస్థ డైరెక్టర్స్ మిస్ హుయ్, శివకుమార్ అన్నారు. స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'కృత్రిమ మేధస్సు మరియు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్' అనే అంశంపై శనివారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. సంక్లిష్టమైన పనులను పూర్తి చేయడం, భిన్న ఉత్పత్తులు, సేవలపై పెట్టుబడి పెట్టడంలో ఏఐ నైపుణ్యాలు ఎలా ఉపయోగపడతాయన్నదానిని వివరించారు. ఎంటర్‌ప్రెన్యూర్‌గా మారే అవకాశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డి.వి.రామమూర్తి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'జమిలి'.. కొండను తవ్వి ఎలుకను పట్టడమే..

- లోకసత్తా పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ



విజయనగరం ఫూల్‌బాగ్: భారతదేశంలో ఒకే దేశం ఒకే ఎన్నిక పేరుతో జమిలి ఎన్నికల నిర్వహణకు పూనుకోవడం కొండను తవ్వి ఎలుకను పట్టినట్టుగా ఉంటుందని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ అభిప్రాయపడ్డారు. విజయనగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలు ఉన్న దేశంలో కులం, మతం, ధనిక, పేద తేడా లేకుండా వయోజనులందరికీ ఓటు హక్కును కల్పించిన గొప్ప ప్రజాస్వామిక, గణతంత్ర దేశం భారత్ అని అన్నారు. అమెరికా, బ్రిటన్ తదితర అభివృద్ధి చెందిన దేశాల్లో స్వాతంత్రం వచ్చిన 100 నుంచి 150 ఏళ్లు దాటితే గానీ అర్హులందరికీ ఓటు హక్కు కల్పించలేదని తెలిపారు. దేశంలో తెలివితేటలు ఉన్న పేదవానికి సరైన విద్య అందడం లేదని, జబ్బు చేస్తే మంచి వైద్యం చేసుకునే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గణతంత్ర దినోత్సవ వేళ సంబరాలతో పాటు దేశంలో అట్టడుగున ఉన్న ప్రజల సమస్యలను గుర్తించాల్సిన అవసరం పాలకులపై ఉందన్నారు. రాష్ట్రాలు బలపడినా పూర్తి అధికారాలు స్థానిక సంస్థలకు చేతుల్లోకి రాలేదని వివరించారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి, నాయకులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

పార్వతీపురంటౌన్:

గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. పోలీస్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా పరేడ్ గ్రౌండ్‌ను ముస్తాబుచేశాయి. కలెక్టరేట్‌ను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. కవాతుకు పోలీస్ బలగాలు సిద్ధమవుతున్నాయి. కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ మాధవ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే వేడుకల్లో పాల్గొనే విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలపై శనివారం రిహార్సల్స్ చేశారు.



ముస్తాబైన పరేడ్ గ్రౌండ్



విద్యుత్ కాంతుల్లో కలెక్టరేట్

టార్గెట్ రూ.4 కోట్లు!

- మద్యం షాపుల నిర్వాహకుల నుంచి దండిగా వసూళ్లు
- విజయనగరం జిల్లాలో 153, పార్వతీపురం మన్యం జిల్లాలో 52 మద్యం షాపులే లక్ష్యం
- 'రెన్యువల్' అవకాశంగా రూ.2 లక్షల చొప్పున టార్గెట్
- సర్కిల్ ఇన్‌స్పెక్టర్లదే వసూలు బాధ్యత
- ఒత్తిళ్లు తట్టుకోలేక ఓ సీఐ ఆస్పత్రి పాలు
- ఎక్సైజ్ శాఖలో ఓ ఉన్నతాధికారి అవినీతి కంపు



సాక్షి ప్రతినిధి, విజయనగరం:

కూటమి ప్రభుత్వంలో నాలుగు రాళ్లు వెనకేసుకుందామని మద్యం వ్యాపారంలోకి దిగిన వారిలో చాలామంది ఇప్పుడు ఆశించిన స్థాయిలో లాభాలు రాకపోవడంతో నెత్తీనోరూ కొట్టుకుంటున్నారు. లాటరీలో ఎలాగైనా షాపు దక్కించుకోవాలని దరఖాస్తు ఫీజు రూపంలోనే లక్షల రూపాయలు ప్రభుత్వానికి సమర్పించుకున్నారు. ఇప్పుడు 'రెన్యువల్' చేసుకోవాల్సి ఉండడంతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో ఓ ఉన్నతాధికారి అవినీతి వ్యవహారంతో మద్యం షాపుల నిర్వాహకుల పరిస్థితి మూలిగే నక్కపై తాటిపండు పడినట్లుంది. విజయనగరం జిల్లాలో ఉన్న 153, పార్వతీపురం మన్యం జిల్లాలో 52 మద్యం షాపుల నుంచి రూ.2 లక్షల చొప్పున దండుకోవాలనేది ఆయన లక్ష్యం. అలా మొత్తంగా రూ.4 కోట్లకు పైగా వసూలు చేసి ఇవ్వాల్సిన బాధ్యత కూడా ఈ రెండు జిల్లాల్లో ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లపైనే పెట్టారు. ఓ ఇద్దరు సీఐలు మంచి ఉత్సాహంగా ఆ పనిలో ఉన్నా మిగిలిన వారు ఇదేమి బాధరా బాబూ అనుకొని తలలు పట్టుకుంటున్నారు. ఆయన ఒత్తిడికి తట్టుకోలేక విజయనగరం జిల్లాలో ఓ సీఐ గుండెపోటుతో ఆస్పత్రి పాలైపోయారంటే పరిస్థితి ఎలా ఉందో ఊహించవచ్చు.

ఆది నుంచి వివాదాలే....

ఉభయ జిల్లాల్లో మద్యం వ్యాపారులు, ఎక్సైజ్ సిబ్బంది గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తున్న సదరు ఉన్నతాధికారి ప్రస్థానం తొలి నుంచి వివాదాస్పదమే. ఉత్తరాంధ్ర జిల్లాల్లో మద్యం షాపుల నుంచి శాంపిళ్లు తీసుకొని పరీక్షించే విశాఖపట్నంలోని రీజినల్ ల్యాబ్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించారు. తర్వాత ల్యాబ్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందారు. వాస్తవానికి బీఎస్సీ కెమిస్ట్రీ విద్యార్హత కలిగిన జూనియర్ అసిస్టెంట్లకు ల్యాబ్ అసిస్టెంట్‌గా పదోన్నతికి అవకాశం ఉంటుంది. ఒకవేళ ఒకరికి కంటే ఎక్కువమంది అదే అర్హతతో ఉంటే వారిలో బీఎస్సీలో అత్యధిక మార్కులు పొందినవారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ప్రకారం ఆ సమయంలో తనకంటే మెరిట్ కలిగినవారు మరో ముగ్గురు ఉన్నప్పటికీ ఆయన మాత్రం అప్పట్లోనే ఓ ఉన్నతాధికారిని ప్రసన్నం చేసుకుని అడ్డదారిలో పదోన్నతి కొట్టేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఆరోపణలు ఒక్కటే కాదు బాధిత ఉద్యోగులు ముగ్గురూ కోర్టులో కేసు వేశారు. ఆ కేసు ఇంకా ఎటూ తేలలేదు. కానీ ఆయన మాత్రం తర్వాత అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఏఈఎస్)గా పదోన్నతి పొందారు. అదీ వివాదాస్పదమే. వాస్తవానికి ఏఈఎస్‌గా పదోన్నతికి ఉండాల్సిన కనీస ఎత్తు కంటే కూడా ఈయన తక్కువ ఎత్తు ఉంటారు. కానీ పదోన్నతి ఎలా వచ్చిందంటే అక్కడా ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకోవడమే అసలు రహస్యమని ఆ శాఖలోని వారే చెబుతున్నారు. ఈ పదోన్నతినీ సవాలు చేస్తూ కొంతమంది కోర్టును ఆశ్రయించారు. ఈ కేసూ పెండింగ్‌లోనే ఉంది. ఇక సొంత జిల్లాలో పోస్టింగ్ ఇవ్వకూడదనే నిబంధనలు ఉన్నా ఆయన మాత్రం విశాఖ జిల్లాలోనే ఎక్కువగా తిష్టవేశారు. ఇన్‌చార్జి ఏఈఎస్‌గా విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం... ఇలా అన్నీ జిల్లాల్లోనూ ఆయన సుపరిచితులే. ఇప్పుడు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఉన్నతాధికారిగా వసూల్ రాజా అవతారం ఎత్తారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వసూలు బాధ్యత సీఐలకు...

లైసెన్స్ రెన్యువల్ కోసం ఒక్కో దుకాణదారుడు (లైసెన్సీ) దరఖాస్తు ఫీజు మొత్తాన్ని మామూళ్ల కింద వసూలుచేయాలని రెండు జిల్లాల్లోని ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు ఆ ఉన్నతాధికారి హుకుం జారీ చేశారు. దరఖాస్తు ఫీజు అంటే రూ.2 లక్షలు చొప్పున వసూలు చేయాల్సి ఉంది. తొలుత సీఐలంతా తటపటాయించినప్పటికీ ఆ ఉన్నతాధికారికి సన్నిహితంగా ఉండే ఇద్దరు సీఐలు మాత్రం అత్యుత్సాహంతో తమ పరిధిలోని లైసెన్సీల నుంచి రూ.2 లక్షల చొప్పున వసూలు చేసి ఇచ్చేశారు. దీంతో మిగిలినవారంతా వారి బాటలోనే నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ ఒత్తిళ్ల తట్టుకోలేక విజయనగరం జిల్లాలో ఓ సీఐ ఏకంగా గుండెపోటుతో ఆసుపత్రిలో చేరారని తెలిసింది.

రూ.లక్షల్లో ముడితేనే పని...



కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న కొత్త మద్యం పాలసీతో ఏర్పాటైన ప్రైవేటు మద్యం దుకాణాలే ఇప్పుడు అవినీతి అధికారులకు ఆదాయ వనరుగా మారాయి. ఇప్పుడా దుకాణాల నుంచి రెన్యువల్ పేరుతో రూ.2 లక్షల చొప్పున వసూలు చేయాలని ఎక్సైజ్ శాఖ కీలక పోస్టులో ఉన్న సదరు ఉన్నతాధికారి ఇండెంట్ పెట్టారు. ఆ మొత్తాన్ని వసూలుచేసే బాధ్యత సంబంధిత ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు అప్పగించారు. వాస్తవానికి లాటరీలో దుకాణాలు దక్కించుకున్న నిర్వాహకులకు అప్పటికప్పుడు ఎక్సైజ్ శాఖ నుంచి తాత్కాలిక పర్మిట్లను జారీచేశారు. ఇప్పుడు రెన్యువల్ చేసుకోవడం ద్వారా ఏడాది కాలానికి పర్మినెంట్ పర్మిట్ జారీ చేయాలి.

శంబర జాతరకు 700 మంది పోలీసులతో బందోబస్తు

- అడిషనల్ ఎస్పీ దిలీప్‌కిరణ్



శంబరలో జాతర ఏర్పాట్లు పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ దిలీప్‌కిరణ్

మక్కువ: మండలంలోని శంబర గ్రామంలో ఈ నెల 27, 28, 29వ తేదీల్లో జరగనున్న పోలమాంబ అమ్మవారి జాతరకు 700 మంది పోలీసులతో బందోబస్తు విధులు నిర్వహిస్తామని అడిషనల్ ఎస్పీ దిలీప్‌కిరణ్ తెలిపారు. శంబర గ్రామాన్ని ఆయన శనివారం సందర్శించారు. ముందుగా చదురుగుడిలో పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామంలో జాతర ఏర్పాట్ల పనులు, పార్కింగ్ ప్రదేశాలు, చెక్ పోస్టులు, క్యూలను పరిశీలించారు. కవిరిపల్లి, మామిడిపల్లి, ఎర్రసామంతవలస గ్రామాలతో పాటు, ఎంట్రీ పాయింట్‌లు అన్ని చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటుచేస్తామన్నారు. ఆయన వెంట సీఐ రామకృష్ణ, ఎస్సై వెంకటరమణ, సిబ్బంది ఉన్నారు.

సిరిమాను చెట్టు సేకరణ

- నేడు శంబర గ్రామానికి పశువులేర్లతో తరలింపు



రైతులు సేకరించిన సిరిమాను చెట్టు

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబరపోలమాంబ అమ్మవారి జాతరలో ప్రధాన ఘట్టం సిరిమానోత్సవం. ఈ నెల 28వ తేదీన సిరిమానోత్సవం కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అధికారులు, గ్రామస్తులు సన్నహాలు చేస్తున్నారు. అందులో భాగంగా శనివారం రైతులంతా కలిసి సిరిమాను తయారీకి అవసరమైన తాడికర్రను సాలూరు మండలం కందులపదం గ్రామ సమీపంలో గుర్తించారు. జన్నివారి కుటుంబీకులు పూజలు చేశాక తాడిచెట్టును గొడ్డళ్లసాయంతో కొట్టారు. దీనిని పశువులేర్లతో ఆదివారం గ్రామానికి తీసుకొస్తారు. ఇక్కడి వడ్రంగులు సిరిమాను, గుజ్జుమానుగా మలుస్తారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

మోసం చేశారు.. న్యాయం చేయండి



టూటౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో బాధితుల ఆందోళన

విజయనగరం క్రైమ్: బుద్ధయోగా ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో యోగా ఇన్‌స్ట్రక్టర్ పోస్టులను ఇప్పిస్తామని మోసం చేసిన నిందితులను నిరుద్యోగులు శనివారం నిలదీశారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1200 మంది అభ్యర్థుల నుంచి రూ.3లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేసి నిలువునా ముంచేశారంటూ ఆందోళన చేశారు. నెలకు రూ.18వేల నుంచి రూ.25 వేల వరకు జీతం ఇస్తామని చెప్పి పోస్టుల్లో నియమించి పైసా ఇవ్వకుండా మోసం చేశారంటూ సంస్థ సభ్యులపైన పలువురు నిరుద్యోగులు విజయనగరం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో గతంలో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదుచేసిన పోలీసులు ఇప్పటికే ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. మరో ముగ్గురు నిందితులు హైకోర్టు ఉత్తర్వులతో స్టేషన్ బెయిల్ తీసుకునేందుకు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. విషయం తెలుసుకున్న నిరుద్యోగులు అధికమంది స్టేషన్‌కు చేరుకుని నిందితులను నిలదీశారు. రూ.లక్షల్లో తీసుకున్న డబ్బులు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. మోసం చేశారు.. న్యాయం చేయండి అంటూ సీఐ శ్రీనివాసరావుకు గోడు వినిపించారు. దీనిపై ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులను మోసం చేసిన కేసులో షేక్ సయ్యద్ వలీ, లక్ష్మీనారాయణ రెడ్డి, మహీందర్ రెడ్డికి హైకోర్టు ఉత్తర్వుల ననుసరించి స్టేషన్‌బెయిల్ ఇచ్చినట్లు తెలిపారు.

చూడచక్కని సోలార్ బండి



సోలార్ శక్తితో నడిచే ఆటోను తయారుచేసిన విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది

- అవంతి సెయింట్ థెరిసా విద్యార్థుల ప్రతిభ



సోలార్‌తో నడిచే వెహికల్

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి అవంతీ సెయింట్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు సోలార్ శక్తితో నడిచే ఆటోను తయారుచేసి అందరి దృష్టినీ ఆకర్షించారు. కళాశాలలో విశాఖపట్టణానికి చెందిన సూర్యరెన్యూవబుల్ ఎనర్జీ సిస్టమ్స్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు సోలార్ ఎలక్ట్రిక్ హైబ్రిడ్ వెహికల్స్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఇందులో పాల్గొన్న బీటెక్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ విభాగాలకు చెందిన ఫైనల్ ఇయర్ విద్యార్థులు సోలార్‌తో నడిచే వెహికల్‌ను తయారు చేశారు. కాలుష్యరహిత వాహనానికి భవిష్యత్తులో డిమాండ్ ఉంటుందన్నారు. వాహనం నడుస్తున్నప్పుడే ఆటోమేటిక్‌గా చార్జింగ్ అవుతుందని తెలిపారు. ఫాల్ట్ ఐడెంటిఫికేషన్ సిస్టం, ఆటో కట్ ఆఫ్ చార్జర్, సెంట్రల్ లాకింగ్ సిస్టమ్, యాంటీ థెఫ్టింగ్ అలారమ్, బ్యాలెన్సెడ్ రియల్‌షాక్ అబ్జర్వన్స్, లోడ్ గేర్ సిస్టం వంటి అధునాతన వ్యవస్థలు ఈ వాహనం ప్రత్యేకతలని కళాశాల ప్రిన్సిపాల్ డా.వి. జాషువా జయప్రసాద్ తెలిపారు. ఈ వాహనం 48 ఓల్ట్ సిస్టమ్‌తో తయారైందని, 300 కిలోల లోడ్‌తో 80 నుంచి 100 కిలోమీటర్ల దూరం వరకు నిశ్చింతంగా ప్రయాణించవచ్చన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఏఓ జి.అనిల్‌కుమార్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో మెరిసిన..

తలవరం సైన్స్ ప్రాజెక్టు

- ఆకట్టుకున్న నాన్ మోటార్ వాటర్ పంప్ ప్రాజెక్టు
- విద్యార్థులు, గైడ్‌పై అభినందనల జల్లు



విద్యార్థులకు అవార్డు, ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న పుదుచ్చేరి స్పీకర్, విద్యాశాఖ మంత్రి



'నాన్ మోటార్ వాటర్ పంప్' ప్రాజెక్టుతో గైడ్ టీచర్ రామారావు, విద్యార్థులు

వీరఘట్టం: మండలంలోని తలవరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు రూపొందించిన 'నాన్ మోటార్ వాటర్ పంప్' ప్రాజెక్టు జాతీయ స్థాయిలో మెరిసింది. కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో ఈ నెల 22 నుంచి 25 వరకు జరిగిన సాధరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో ఆంధ్రప్రదేశ్ తరపున ప్రదర్శించిన ప్రాజెక్టు జాతీయ స్థాయిలో రెండవ స్థానాన్ని సొంతం చేసుకుంది. ఈ నెల 8న విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో గైడ్ గిరడ రామారావు ఆధ్వర్యంలో విద్యార్థులు దుప్పాడ నితిన్‌కుమార్, పి.గోవిందరావు రూపొందించిన ఈ ప్రాజెక్టు రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించి జాతీయ స్థాయికి ఎంపికైంది. అక్కడ కూడా న్యాయనిర్ణేతలను ఆకట్టుకుంది. పుదుచ్చేరి స్పీకర్, విద్యాశాఖ మంత్రులు వీరికి ట్రోఫీ, రూ.5 వేలు నగదు ప్రోత్సాహకాన్ని విద్యార్థులకు అందజేశారు.

తయారీ.. ఉపయోగాలు ఇలా..

'నాన్ మోటార్ వాటర్ పంప్' ను ఎత్తైన ప్రదేశాలకు నీటిని పంపించేందుకు ఉపయోగిస్తారు. దీనికి విద్యుత్, డీజిల్, పెట్రోల్, గ్యాస్ వంటి ఇంధన శక్తి అవసరం లేకుండా పనిచేసే పంపింగ్ మిషన్ ఇది. నీటి యొక్క గతిజశక్తి, గ్రావిటీ ఆధారంగా పంప్ పనిచేస్తుంది. పంప్‌ను పంపింగ్ చేయాల్సిన నీటి కంటే తక్కువ ఎత్తులో ఉంచాలి. ఒక పైపు ద్వారా ఆ నీరు పంపులోకి వచ్చేలా అమర్చాలి. గ్రావిటీ వల్ల నీరు పంపులోకి వస్తుంది. పంపులో ఉండే వేస్ట్ వాల్వ్ నీటి ఒత్తిడికి మూసివేయబడుతుంది. పంపులో అధిక ఒత్తిడి జరిగి డెలివిరీ వాల్వ్ ఓపెన్ కావడంతో నీరు బయటకు వస్తుంది. పైన చాంబర్‌లో ఉండే గాలి, హై ప్రెజర్‌ను బ్యాక్‌వర్డ్ డైరెక్షన్‌లో పనిచేసి నీటిని డెలివిరీ ట్యూబు ద్వారా ఎత్తైన ప్రదేశాలకు నీటిని పంపిస్తుంది. ఎప్పుడైతే నీరు ఎత్తైన ప్రదేశాలకు పంపిణీ అవుతుందో పంపులో తిరిగి లో ప్రెజర్ క్రియేట్ అవుతుంది. ఇలా సైక్లింగ్ విధానంలో పంపు పనిచేస్తూ నిరంతరం పైకి నీరు సరఫరా అవుతుంది.

అభినందనలు వెల్లువ

తలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్టుకు జాతీయస్థాయిలో గుర్తింపు రావడంతో గైడ్‌తో పాటు విద్యార్థులకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులతో పాటు డీఈఓ ఎస్.తిరుపతినాయుడు, పాలకొండ ఉప విద్యాశాఖాధికారి పర్రి కృష్ణమూర్తి, ఎంఈఓలు డి.గౌరినాయుడు, ఆర్.ఆనందరావు, పాఠశాల హెచ్ఎం జగన్, జిల్లా సైన్స్ టీచర్ జి.లక్ష్మణరావు తదితరు అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

ఏపీఎస్‌ఆర్టీసీ బలోపేతానికి చర్యలు

- ఆర్టీసీ జోనల్ చైర్మన్ ఎస్.దన్నుదొర


ఆర్టీసీ జోనల్ చైర్మన్ దన్నుదొర

రామభద్రపురం: ఏపీఎస్‌ఆర్టీసీ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నామని ఏపీఎస్‌ఆర్టీసీ జోనల్ చైర్మన్ ఎస్.దన్నుదొర అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ జోనల్ పరిధిలో ఆర్టీసీకి ప్రయాణికుల ద్వారా సుమారు రూ.4.50 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. ఉత్తరాంధ్రలోనే అతిపెద్ద జాతరైన శంబర జాతరకు ఎక్కువ బస్సులు నడిపేందుకు అధికారులు దృష్టి సారించారన్నారు. గిరిజన గ్రామాలలో ఇదివరలో నడిపి ఆగిన బస్సులను తిరిగి పునరుద్ధరిస్తామని చెప్పారు. రామభద్రపురం మండలం ఎనుబరువు గిరిజన గ్రామానికి సాలూరు డిపో నుంచి పాచిపెంట మీదుగా పల్లెవెలుగు బస్సు పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆదివాసీ సాంస్కృతిక మహోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: రాజమండ్రిలోని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీలో ఫిబ్రవరి 5, 6 తేదీల్లో టీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరగనున్న జాతీయ స్థాయి ఆదివాసీ సాంస్కృతిక మహోత్సవాల వాల్‌పోస్టర్లను ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి శనివారం ఆవిష్కరించారు. భారత దేశంలో గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరికీ ఉందన్నారు. కార్యక్రమంలో టీఎస్ఎఫ్ నాయకులు అక్కులప్పనాయక్, విష్ణునాయక్, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

179 మద్యం సీసాల సీజ్

గజపతినగరం: మండలంలోని మరుపల్లి గ్రామం సమీపంలో 110 మద్యం సీసాలను తరలిస్తున్న మరుపల్లి గ్రామానికి చెందిన లెంక సురేష్ అనే వ్యక్తిని శనివారం అదుపులోకి తీసుకొని మద్యం సీసాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. షాపుల్లో కొనుగోలు చేసి ప్రభుత్వ అనుమతులు లేకుండా మద్యం వ్యాపారాలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. గజపతినగరం మండల కేంద్రంలో జాతీయ రహదారి బ్రిడ్జి వద్ద బొండపల్లి మండలం దేవుపల్లి గ్రామానికి చెందిన వెంకటరమణ అనే వ్యక్తి సైకిల్‌పై 69 (బాటిల్స్)మద్యం సీసాలను అక్రమంగా తరలిస్తుండగా ఆయనను శుక్రవారం రాత్రి అదుపులోకి తీసుకోవడం జరిగిందని స్థానిక ఎస్సై కె.లక్ష్మణరావు తెలిపారు. మొత్తం ఇద్దరు వ్యక్తుల నుంచి 179మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

శంబర జాతరకు ప్రత్యేక బస్సులు

సాలూరు: శంబర జాతర నేపథ్యంలో సాలూరు ఆర్టీసీ డిపో నుంచి శంబరకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డీఎం భాస్కరరెడ్డి శనివారం తెలిపారు. జాతర నేపథ్యంలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని ఈ క్రమంలో ప్రత్యేక బస్సులు నడపనున్నామని అన్నారు. ఆదివారం 5 బస్సులు, సోమవారం 10 బస్సులు, మంగళవారం 25 బస్సులు, బుధవారం 10 ప్రత్యేక బస్సులు నడపనున్నామని తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

విజయనగరం క్రైమ్: విజయనగరం కోరుకొండ రైల్వేస్టేషన్‌ల మధ్య రైల్వే ట్రాక్ మధ్యలో గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం పడి ఉందని జీఆర్‌పీ ఎస్ఐ వి.బాలాజీరావు శనివారం తెలిపారు. సుమారు 50 నుంచి 55 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి ఐదడుగుల నాలుగు అంగుళాల ఎత్తు కలిగి, చామన ఛాయ రంగు, బిస్కెట్, కాఫీ రంగు పువ్వుల షర్ట్, నీలం రంగు ఫుల్ ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. ఆచూకీ తెలిసిన వారు 9490617089 నంబరునుగాని, జీఆర్‌పీ పోలీసులనుగానీ సంప్రదించాలని కోరారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹140	₹250	₹260

అధికార హుకుం..!

- అధికార పార్టీ నేతల దందా..
- రైతులతో రాజకీయం
- కూటమి నేతలు చెబితేనే డ్రోన్‌లు ఇస్తారట..!
- జిల్లాకు 25 డ్రోన్లు మంజూరు



- సార్ నేను డ్రోన్ కోసం దరఖాస్తు చేసాను. ఎప్పుడు ఇస్తారని ఓ రైతు సంబంధిత వ్యవసాయ అధికారిని అడిగాడు. సదరు అధికారి అధికార పార్టీకి చెందిన నేతతో ఓ మాట చెప్పించండి.. మీకు డ్రోన్ మంజూరు అయిపోతుందని చెప్పినట్లు తెలిసింది. అంతేకాకుండా డ్రోన్‌కు రాయితీ ఎక్కువగా ఇస్తున్నందున అధికార పార్టీ నేతలు చెప్పిన వారికే ఇవ్వాలని ఉన్నత అధికారుల నుంచి మాకు ఆదేశాలు వచ్చాయని రైతుతో అన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

విజయనగరం ఫోర్ట్: వ్యవసాయంలో సాగు కోసం డ్రోన్ల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు అధికారుల నుంచి ఎదురవుతున్న అనుభవాలు కూటమి నేతల అధికార పెత్తనానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. అందరికీ అన్నం పెట్టే రైతన్నతోనూ కూటమి నేతలు రాజకీయం చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రైతుల పట్ల నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన అధికారులు అందుకు విరుద్ధంగా కూటమి నేతలు చెప్పినట్లు వ్యవహరిస్తున్నారు. కూటమి నేతలను ప్రసన్నం చేసుకుంటేనే డ్రోన్లు ఇస్తామని అధికారులు ఖరాఖండిగా చెబుతుండడంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

జిల్లాకు 25 డ్రోన్‌లు మంంజూరు

జిల్లాకు 25 డ్రోన్‌లు మంజూరయ్యాయి. జిల్లాలో 27 మండలాలు ఉన్నప్పటికీ 25 మాత్రమే మంజూరయ్యాయి. వీటి కోసం కొంతమంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న వారు కూటమి పార్టీకి వారికి చెందిన వారా.. లేదా ఇతర పార్టీలకు చెందిన వారా.. అని అధికార పార్టీ నేతలు వాకబు చేస్తున్నారు. ప్రతిపక్ష పార్టీకి చెందిన వారు అయితే వారికి డ్రోన్ నిలిపివేయాలని సంబంధిత వ్యవసాయ అధికారులకు అధికార పార్టీ నేతల నుంచి ఆదేశాలు వెళ్లినట్టు తెలిసింది.

మంత్రులు, ఎమ్మెల్యేలు చెప్పిన వారికే ఇవ్వాలని ఆదేశాలు

జిల్లాకు మంజూరైన డ్రోన్‌లను అధికార పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు చెప్పిన వారికే ఇవ్వాలని వ్యవసాయ అధికారులకు ఆదేశాలు వచ్చినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అన్ని నియోజకవర్గాల్లోను ఆ విధంగా చేయాలని ఆదేశాలు వచ్చినట్టు సర్వత్రా చర్చ జరుగుతుంది. అధికార పార్టీ అండగాని, అధికార పార్టీకి చెందిన కార్యకర్త అయితే తప్ప డ్రోన్ మంజూరు కాదనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

80 శాతం రాయితీ

ఒక్కో డ్రోన్‌కు 80 శాతం వరకు రాయితీ ఇవ్వనున్నారు. డ్రోన్ విలువ రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షలు వరకు ఉంది. ఇందులో ప్రభుత్వం రూ.8 లక్షల వరకు రాయితీ ఇస్తుంది. మిగతాది రైతు భరించాల్సి ఉంటుంది. రాయితీ ఎక్కువగా ఇస్తున్నాం.. కాబట్టి ఆ లబ్ధి కూడా కూటమికి చెందిన కార్యకర్తలే లబ్ధి పొందాలని కూటమి సర్కార్ యోచిస్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రజాప్రతినిధుల సూచనలు కూడా తీసుకుంటున్నాం..

జిల్లాకు 25 డ్రోన్లు మంజూరయ్యాయి. డ్రోన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఇప్పుడు డ్రోన్ తీసుకోవడానికి ఇష్టపడుతున్నారా.. లేదా.. అని అడుగుతున్నాం. డ్రోన్‌లు మంజూరులో ప్రజాప్రతినిధుల సూచనలు కూడా తీసుకుంటున్నాం.

– వి.తారకరామరావు, జిల్లా వ్యవసాయ అధికారి

వ్యాకులమాత పుణ్యక్షేత్రంలో ప్రార్థనలు


ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవ సోదరలు

కొత్తవలస: మండలంలోని గొల్లలపాలెం గ్రామ సమీపంలో గల కొండదాబాల ఆర్‌సీఎం చర్చ వ్యాకులమాత పుణ్యక్షేత్రం యాత్ర మహోత్సవం సందర్భంగా నవీనా ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి.

రెండో రోజు శనివారం పరిశుద్ధ దివ్యబలి పూజను గురుశ్రీ వర్గీస్‌చాపరత్ నిర్వహించారు. విశాఖపట్నంకు చెందిన సాలిగ్రామపురం, వెంకోజీపాలెం, సీతమ్మధార చర్చల విచారణ కర్తలు, విచారణ భక్తి సంఘాలు పాల్గొన్ని ప్రత్యేక ప్రార్థనలు చేసారు. గురుశ్రీ ఎస్.పీటర్ ప్రసంగిస్తూ మరియతల్లి నరీక్షణ – శ్రీసభనిరీక్షణ కోసం వివరిస్తూ ప్రసంగించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున క్రైస్తవ సోదరలు పాల్గొన్నారు.

9న ప్రజ్ఞావికాసం పరీక్ష

విజయనగరం పూల్‌బాగ్: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9న ప్రజ్ఞా వికాసం పరీక్షను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు వెంకటేష్ తెలిపారు. పరీక్షకు సంబంధించి వాల్‌పోస్టరును ఎల్‌బీజీ భవన్‌లో శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులకు ప్రజ్ఞావికాసం పరీక్ష ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఇందులో పాల్గొని అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు వరుసగా రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు బహుమతిగా ఇవ్వనున్నట్టు తెలిపారు. పరీక్ష రాసే విద్యార్థులు ఫిబ్రవరి 1వ తేదీలోపు ఫీజు రూ.30 చెల్లించి పేర్లు నమోదు చేసుకుని హాల్‌టిక్కెట్ తీసుకోవాలన్నారు. వివరాలకు 75692 90549, 79975 32521 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలి

- డీసీసీ అధ్యక్షుడు విద్యాసాగర్


కార్యక్రమంలో మాట్లాడుతున్న విద్యాసాగర్

విజయనగరం ఫోర్ట్: ఎన్నికల ముందు చెప్పిన సూపర్ – 6 హామీలు అన్నింటిని కూటమి ప్రభుత్వం నేరవేర్చాలని డీసీసీ అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్ డిమాండ్ చేసారు. ఈథాలీ భజావో కార్యక్రమం పేరిట కలెక్టరేట్ వద్ద ప్లేట్లు – స్పూన్లుతో పెద్ద శబ్దం చేస్తూ శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి సర్కార్ ఏర్పడి నేటికి 227 రోజులు అయిందన్నారు. ఇప్పటి వరకు ఫించన్లు, ఉచిత గ్యాస్ తప్ప ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, పథకాలు అమలు చేయలేదన్నారు. బాబు ష్యూరిటీ – భవిష్యత్తు గ్యారంటీ అని బాబు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా మూలన పెట్టారన్నారు. యువతకు 20 లక్షలు ఉద్యోగాలు లేదా నిరుద్యోగ భృతి క్రింద నెలకు రూ.3 వేలు, స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు, ఇంట్లో ఎంతమంది చదివితే అంతమందికి ఇస్తామని చెప్పి ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం, ప్రతి మహిళకు 18 నుంచి 59 సంవత్సరాల వయసుగల వారికి నెలకు రూ.1500, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పి ప్రజలను మోసం చేసారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలు చేయకపోవడం వల్ల పిల్లలు చదువులకు దూరం అవుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్లు గేదెల తిరుపతిరావు, సతీష్, సురేష్, శ్రీనివాస్‌రావు, షరీఫ్, బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రామాయణంలోని విలువలను తెలుసుకోవాలి


కార్యక్రమంలో పాల్గొన్న వారికి జ్ఞాపికల అందజేత

విజయనగరం రూరల్: రామాయణంలోని విలువలను నేటి తరం తెలుసుకోవాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త వేమకోటి సూర్యనారాయణ శర్మ పిలుపునిచ్చారు. మండలంలోని రామనారాయణ ప్రాంగణంలో రెండో రోజు శనివారం నిర్వహిస్తున్న యువ సదస్సుకు ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని సంభాషించారు. రామాయణంలోని ఉన్న అద్భుతమైన పలు అంశాలను నేటితరం యువతకు తెలియజేసేలా ప్రయత్నిస్తున్న నారాయణం శ్రీనువాస్ కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రామాయణంలోని పలు ఘట్టాలను నాటక రూపంలో పలువురు విద్యార్థులు ప్రదర్శన చేశారు. అనంతరం పాడుతా తీయగా గాయకులు పరమేష్ రామాయణంలోని పలు అంశాలపై అనర్గళంగా మాట్లాడి పలువురు ప్రశంసలను అందుకున్నారు. అనంతరం కార్యక్రమంలో చివరగా వేదిక్పై ఉన్న ఆహుతులకు, విద్యార్థులకు జ్ఞాపికలను బహుకరించారు.

29న జాబ్‌మేళా

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 29న జాబ్‌మేళా నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్ఎస్‌డీసీ, ఐటీఐ సంయుక్తంగా నిర్వహించనున్న ఈ జాబ్‌మేళాకు 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ ఉత్తీర్ణులైన 18 నుంచి 35 ఏళ్లలోపు నిరుద్యోగ యువతీయువకులు అర్హులని అన్నారు. జాబ్ మేళాకు ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, హెట్రో ల్యాబ్స్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకు తదితర బహుళజాతి కంపెనీలు హాజరుకానున్నాయని తెలిపారు. ఆసక్తి కలిగిన యువతీయువకులు హెచ్‌టీటీపీ//ఎన్ఏఐపీయూఎస్‌వైఏఎం.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్ సైట్‌లో నమోదుచేసుకొని అడ్మిట్ కార్డుతో పాటు బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్స్ ఒరిజినల్, జిరాక్స్‌తో పాటు ఒక పాస్‌పోర్టు సైజు ఫొటోతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 7286042743, 998853335 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఉత్తమ అధికారులు వీరే...

పార్వతీపురం టౌన్: గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన జిల్లా అధికారులకు అవార్డులు లభించనున్నాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసపత్రాలు అందుకోనున్నారు.

అవార్డులకు ఎంపికైన జిల్లా అధికారులు

జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, పాలకొండ సబ్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్, డీఎం సీఎస్ పి.శ్రీనివాసరావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డీపీఈఓ డి.మంజులావీణ, ఇరిగేషన్ ఈఈ ఆర్.అప్పలనాయుడు, డీసీహెచ్ఎస్ డాక్టర్ బి.వాగ్దేవి, జిల్లా మలేరియా అధికారి వై.మణి, జిల్లా ప్లానింగ్ అధికారి పి.వీర్రాజు, డీఈఓ ఎన్.తిరుపతినాయుడు, ఎస్సీ వెల్ఫేర్ అధికారి ఎండీ గయాజుద్దీన్, డీఎస్ఏఓ ఎస్.వెంకటేశ్వరరావు, ఎంవీఐ ఎం.శశికుమార్, డీజేబుల్డ్ ఏడీ కె.కవిత, సెట్విజ్ సీఈఓ ఆర్.రామగోపాల్, జిల్లా డ్రగ్ అధికారి షేక్ ఆశా, అదనపు ఎస్పీ ఒ.దిలీప్‌కిరణ్.

రాజశేఖరం జీవితం ఆదర్శం

- పాలవలన సంతాప సభలో రాజకీయ ప్రముఖుల నివాళులు
- రాజశేఖరం ఆశయ సాధనకు పిలుపు
- కుటుంబానికి అండగా వైఎస్సార్‌సీపీ
- ఎమ్మెల్సీ బొత్స, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి అంబటి, మాజీ మంత్రులు ధర్మాన సోదరులు
- తండ్రి ఆశయాలను నెరవేర్చుతామన్న ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి


రాజశేఖరం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భార్య ఇందుమతి, కుటుంబ సభ్యులు, పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

పాలకొండ/వీరఘట్టం: రాజకీయ కురువృద్ధుడు పాలవలస రాజశేఖరం నేటి తరం రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయుడని శాసన మండలి విపక్ష నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పాలకొండలో శనివారం నిర్వహించిన పాలవలస రాజశేఖరం సంతాప సభలో వీరు పాల్గొని మాట్లాడారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రస్తుత రాజకీయ నేతలకు రాజశేఖరం గురువు వంటి వారని పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా పరిషత్ చైర్మన్‌గా పని చేసిన ఆయన రెండుసార్లు ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల అభివృద్ధికి ఎనలేని కృషి చేసారని అన్నారు. నాటి తరంలో ఎందరో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి ఎన్నో కుటుంబాలకు జీవనోపాధి కల్పించారని గుర్తు చేసారు. ఆయన భార్య జెట్పీటీసీ సభ్యురాలు ఇందుమతికి, ఆయన కుమారుడు ఎమ్మెల్సీ విక్రాంత్‌కు, కుమార్తె మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు కోలగట్ల వీరభద్రస్వామి, రఘురామకృష్ణరాజు, నర్సు రామారావు, కుంభా రవిబాబు, మాజీ ఎంపీలు బెల్లాన చంద్రశేఖర్, గొడ్డేటి మాధవి, మాజీ ఎమ్మెల్యేలు విశ్వాసరాయి కళావతి, కంబాల జోగులు, అలజంగి జోగారావు, శంబంగి చినప్పల నాయుడు, గొర్లె కిరణ్, కె.భాగ్యలక్ష్మి, బడ్డుకొండ అప్పల నాయుడు, రాజాం వైఎస్సార్ సీపీ కన్వీనర్ తలే రాజేష్, అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయ కర్త కరణం ధర్మశ్రీ, శోభా హైమావతితో పాటు రాజకీయ ప్రముఖులు, వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొని రాజశేఖరానికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాలవలస రాజశేఖరంతో ఉన్న పరిచయాలను, అనుబంధాలను గుర్తు చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కళావతి మాట్లాడుతూ రాజశేఖరం ఆప్యాయత మరువలేనన్నారు. రాజకీయ గురువు ఇకలేరనే నిజాన్ని నమ్మలేకపోతున్నారు. మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ తనను ఎంతో ఆప్యాయంగా పిలిచేవారన్నారు. తమ ప్రాంతంలో ఎందరికో రాజకీయ ఓనమాలు నేర్పారన్నారు. మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ ఎందరో పేదలకు ఆశ్రయం కల్పించిన గొప్ప వ్యక్తి రాజశేఖరం అన్నారు. మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు మాట్లాడుతూ అజాత శత్రువుగా ప్రజల గుండెల్లో కొలువుదీరిన రాజశేఖరం జీవితం ఎందరికో ఆదర్శమన్నారు. వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ సమన్వయకర్త తలే రాజేష్ మాట్లాడుతూ విలువలతో కూడిన రాజకీయాలు చేసిన గొప్ప వ్యక్తి పాలవలస రాజశేఖరం అని కొనియాడారు.

ఒక శకం ముగిసింది

సీనియర్ రాజకీయ నాయకులు, గురు సమానులు పాలవలస రాజశేఖరం మరణంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఒక రాజకీయ శకం ముగిసింది. 1970లో రాజకీయ ప్రస్తానం ప్రాంభించిన సీనియర్ నాయకుల్లో దాదాపు అందరూ రాజకీయాలకు దూరం కాగా ఈయన మాత్రం ఇంత వరకు ప్రత్యక్ష రాజకీయాల్లో చురుకుగా వ్యవహరించారు. శ్రీకాకుళం జిల్లాలోని రాజకీయ ప్రముఖులు సర్దార్ గౌతు లచ్చన్న, బొడ్డేపల్లి రాజగోపాలరావు, గొర్లె శ్రీరాములనాయుడు వంటి ఉద్దండులతో రాజశేఖరం కలసి సమకాలీన రాజకీయం చేసారు.

– ధర్మాన ప్రసాదరావు, మాజీ మంత్రి

పార్టీ ఆవిర్భావం నుంచి..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి నమ్మిన బంటుగా పాలవలస రాజశేఖరం గుర్తింపు పొందారు. దివంగత నేత రాజశేఖరరెడ్డి ఇతన్ని పేరుపెట్టి పిలిచే సన్నిహిత్యాన్ని పొందారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుండి పార్టీలో ఉంటూ ఈ ప్రాంతంలో పార్టీ బలోపేతం అయ్యేందుకు రాజశేఖరం ముఖ్య భూమిక పోషించారు.

– ధర్మాన కృష్ణదాస్, మాజీ ఉప ముఖ్యమంత్రి

ఆదర్శప్రాయుడు

పెద్ద రాజుగా ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఎంతో ప్రాచుర్యం పొందిన రాజకీయ కురువృద్ధులు, సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే, రాజ్యసభ మాజీ సభ్యులు, శ్రీకాకుళం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, తూర్పుకాపు సామాజిక వర్గం ఆశాకిరణం, కింగ్ మేకర్‌గా పేరుగాంచిన పాలవలస రాజశేఖరం అలంకరించని పదవంటూ లేదు. కుటుంబ ఉన్నతితో పాటు పేదల పెన్నిధిగా నిలిచిన రాజశేఖరం మనందరికీ ఆదర్శప్రాయుడు.

– మజ్జి శ్రీనివాసరావు, జెడ్పీ చైర్మన్, విజయనగరం

నాన్న ఆశయాలను సాధిస్తా..

నాన్న చనిపోయినప్పటి నుంచి ఎందరో నాయకులు, ప్రజలు, ప్రముఖులు వచ్చి తమ సంతాపాన్ని తెలిపారు. వీరిలో చాలా మంది విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుండి వచ్చి నాన్న వారికి చేసిన సహాయాన్ని గుర్తు చేస్తుంటే ఆయన గొప్పతనం మాకు ఇంకా పూర్తి స్థాయిలో తెలియలేదే అనిపించింది. నాన్న ఆశయ సాధన కోసం కృషి చేస్తాను.

– పాలవలస విక్రాంత్, ఎమ్మెల్సీ

నాన్నే రాజకీయ గురువు

చిన్నప్పటి నుంచి నాన్నను చూస్తూ పెరిగాను. ఎందరో పేదలకు ఆశ్రయం, ఉపాధి కల్పించారు. కష్టాల్లో ఉన్న ఎన్నో కుటుంబాల కన్నీళ్లు తుడిచారు. పేదల పెన్నిధిగా నిలిచి ప్రజాసేవకు తన జీవితాన్ని అంకితం చేసిన నాన్నే నాకు తొలి రాజకీయ గురువు. నా జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు వచ్చాయి. వాటిని అధిగమించేందుకు మా అమ్మ,నాన్న నాకు ఎంతో మనోధైర్యం చెప్పేవాళ్లు.

– రెడ్డి శాంతి, మాజీ ఎమ్మెల్యే